మాకు న్యాయం కావాలి

నాకు నాలుగు నెలల పాప ఉంది. నా భర్త 13వ బెటాలియన్‌లో కానిస్టేబుల్. బందోబస్తుకు పోతే వారం, పది రోజులు రాడు. కొన్ని సార్లు నెలల తరబడి డ్యూటీకి పోతాడు. ఎప్పుడు వస్తాడా అని చిన్న పిల్లతో బిక్కుబిక్కుమని ఎదురు చూడాల్సిన పరిస్థితి. ఏక్ పోలీస్..ఏక్ డ్యూటీ ఇచ్చే వరకు నేను, నా బిడ్డ ఈ రోడ్డు మీదే కూర్చొడానికి సిద్ధమనే వచ్చిన. మాకు న్యాయం కావాలి.

- ఎస్.శిరీష, మంచిర్యాల, గుడిపేట 13వ బెటాలియన్ కానిస్టేబుల్ భార్య

రికార్డ్ పర్మిషన్ వద్దు

ఎప్పటిలాగానే రికార్డ్ పర్మిషన్ పెడుతామంటున్నారు. మాకు మొత్తానికే రికార్డు పర్మిషన్ అవసరం లేదు. ఒకే దగ్గర మా ఫ్యామిలీతో ఐదు సంవత్సరాలు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. మెస్ మొత్తానికే ఎత్తివేయాలి. ఐదేండ్లు ఒకే దగ్గర పోస్టింగ్ ఇస్తే మెస్ అవసరం లేదు. ఏక్ పోలీస్ వ్యవస్థ తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నాం.

- రాజ్యలక్ష్మి, గుడిపేట 13వ బెటాలియన్ కానిస్టేబుల్ భార్య

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లిలో నిరసన ప్రదర్శన చేస్తున్న పోలీసుల భార్యలు, కుటుంబసభ్యులు

భగ్గుమన్న బెటాలియన్లు

మొదటిపేజీ తరువాయి...

శనివారం కానిస్టేబుళ్లు మెరుపు సమ్మెకు దిగారు. కానిస్టేబుళ్లు అందరూ సామూహికంగా సెలవులు పెట్టి ప్రత్యక్షంగా నిరసన చేపట్టారు. అసభ్యంగా మాట్లాడిన నల్లగొండ రూరల్ ఎస్ఐ సైదాబాబును సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కుటుంబసభ్యులతో కలిసి ఆందోళన చేస్తున్న కానిస్టేబుళ్లకు సంఘీభావం తెలిపేందుకు వెళ్లిన మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డిని పోలీసులు బెటాలియన్ గేటు వద్ద అరెస్టు చేశారు. ఆయనను ముందుగా నార్కెట్‌పల్లికి తరలించి, అక్కడి నుంచి మునుగోడు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వరంగల్ జిల్లా మామునూరు లోని నాలుగో బెటాలియన్‌కు చెందిన కానిస్టేబుళ్లు కమాండెంట్ కార్యాలయం ఎదుట ఏక్ పోలీస్ ఆకారంలో బైఠాయించారు. అనంతరం ర్యాలీగా తరలివచ్చి బెటాలియన్ ప్రధాన కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. రాష్ట్రంలో మొదటిసారిగా కానిస్టేబుళ్లు యూనిఫాం ధరించి నిరసన చేపట్టడం అటు హోంశాఖతో ఇటు ప్రజల్లో తీవ్ర చర్చగా మారింది. కమాండెంట్ రాంప్రకాష్, వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా కానిస్టేబుళ్ల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో నిరసనను తాత్కాలికంగా వాయిదా వేశారు. ఇబ్రహీంపట్నం సాగర్‌రహదారిపై బెటాలియన్ పోలీసులు కుటుంబసభ్యులతో కలిసి పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. భార్యాపిల్లలతో కలిసి ప్లకార్డులతో నిరసన తెలిపారు. మహేశ్వరం డీసీపీ సునితారెడ్డి నచ్చజెప్పినా వినకపోవడంతో తీవ్ర వాగ్వాదం జరిగింది. అనంతరం బెటాలియన్ సిబ్బంది ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నిరసన తెలిపారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో గుడిపేట 13వ బెటాలియన్ కానిస్టేబుళ్లు కుటుంబ సభ్యులతో కలిసి రాస్తారోకో చేశారు. చిన్న పిల్లలతో వచ్చిన కానిస్టేబుళ్ల భార్యలు ఎండను సైతం లెక్కచేయకుండా రాస్తారోకోలో కూర్చున్నారు. ఫ్లైఓవర్‌పై రాస్తారోకో చేస్తున్న కానిస్టేబుళ్లతో ఏసీపీ ప్రకాశ్‌కు స్వల్ప వాగ్వాదం జరిగింది. కాసేపటికి బెటాలియన్ కానిస్టేబుళ్లు, వారి కుటుంబ సభ్యులు ఫ్లైఓవర్ నుంచి ఐబీ చౌరస్తా వరకు ర్యాలీ తీశారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో కలెక్టర్ చౌరస్తాలో ఆదిలాబాద్ 2వ బెటాలియన్ కానిస్టేబుళ్ల కుటుంబాలు రాస్తారోకో చేశారు. కానిస్టేబుళ్ల భార్యలను మహిళా కానిస్టేబుళ్లు వచ్చి చెదరగొట్టే ప్రయత్నం చేయగా, ఓ కానిస్టేబుల్ భార్య ఒడిలోని చిన్నపిల్లాడు రోడ్డుపై పడిపోయాడు. కొత్తగూడెం, చాతకొండకు చెందిన ఏఆర్ 6వ బెటాలియన్ కానిస్టేబుళ్ల భార్యలు, వారి కుటుంబ సభ్యులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లిలో శనివారం ప్లకార్డులతో భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ క్రమంలో అక్కడకు చేరుకున్న పోలీస్ అధికారి ఓ కానిస్టేబుల్‌ను తోసివేయడంతో పోలీస్ కుటుంబాలు భగ్గుమన్నాయి.

నల్లగొండలోని అన్నెపర్తి 12వ బెటాలియన్‌లో కానిస్టేబుళ్లు, వారి కుటుంబసభ్యులను పరామర్శించేందుకు వెళ్లిన మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిని అరెస్ట్ చేస్తున్న పోలీసులు



ఎస్సీ అఖిల్ మహాజన్ కాళ్లపై పడ్డ కానిస్టేబుల్

కాళ్మొక్త..న్యాయం చేయండి సార్!

రాజన్నసిరిసిల్ల జిల్లాలోని 17వ పోలీసు బెటాలియన్‌లోని సుమారు 250 మంది కానిస్టేబుళ్లు కమాండెంట్ ఆఫీస్ ఎదుట ధర్నా చేశారు. కమాండెంట్ శ్రీనివాసరావు నైట్ డ్యూటీలు వేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని, తమతో కూలీ పనులు, చెత్త ఏరే పనులు, మట్టి పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. ఆందోళన వద్దకు చేరుకున్న ఎస్సీ అఖిల్‌మహాజన్ కాళ్లపై ఓ కానిస్టేబుల్ పడి న్యాయం చేయాలని కన్నీటిపర్యంతం కావడం అక్కడున్న వారిని కలిచివేసింది.

తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి. చిత్రంలో ఎమ్మెల్సీ వాణీదేవి, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

పోలీసుల ఆందోళన ప్రభుత్వ వైఫల్యమే

- ప్రభుత్వం, డీజీపీ పట్టించుకోకే సచివాలయం ముట్టడి
- తక్షణమే ప్రభుత్వం పిలిచించి చర్చించి పరిష్కరించాలి
- పోలీసు భార్యల ఆందోళనకు మా సంఘీభావం
- మాజీ మంత్రి సబితారెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ): ప్రజలకు రక్షణ కల్పించాల్సిన రక్షకభటులే రోడ్డెక్కాల్సిన దుస్థితి రాష్ట్రంలో తలెత్తిందని బీఆర్ఎస్ మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. క్రమశిక్షణకు మారుపేరైన పోలీసు సిబ్బంది రోడ్డెక్కి ధర్నాలు చేయడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం కాదా? అని నిలదీశారు. హోంమంత్రి లేక ఎవరికి చెప్పాలో తెలియక పోలీసులు ఆందోళనలు చేయడం ముఖ్యమంత్రి వైఫల్యం కాదా? అని ప్రశ్నించారు. ఇదేనా ప్రజాపాలన అంటే? ఇదేనా మార్పు అంటే? అని మండిపడ్డారు. తెలంగాణభవన్‌లో శనివారం ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ వాణీదేవి, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. నల్లగొండ, వరంగల్, డిచ్‌పల్లి బెటాలియన్లలోని కానిస్టేబుళ్ల భార్యలు చంటిపిల్లలను చంకనవేసుకొని, తమకు న్యాయం చేయాలని ఆందోళనలుచేసినా ప్రభుత్వంలో చలనం లేదని విమర్శించారు. ఐదు రోజులైనా ప్రభుత్వం నుంచి పోలీస్‌శాఖ నుంచి ఎలాంటి స్పందన లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరికి కానిస్టేబుల్స్ సచివాలయాన్ని ముట్టడించాల్సిన పరిస్థితి తలెత్తిందని అన్నారు. పోలీసుల భార్యల ఆందోళనకు సంఘీభావం ప్రకటిస్తున్నట్టు చెప్పారు. బెటాలియన్ కానిస్టేబుళ్లను పిలిచి పరిష్కరించి ఉంటే సమస్య ఇంత వరకు వచ్చేది కాదని అభిప్రాయపడ్డారు. కానిస్టేబుల్స్ కుటుంబాలు రోడ్డు మీదకు రావటానికి సీఎం రేవంత్‌రెడ్డే కారణమని విమర్శించారు. హోంశాఖను నిర్వహిస్తున్న రేవంత్ ఫెయిల్ అవ్వటం వల్లే పోలీస్ కుటుంబాలు చిన్నపిల్లలతో రోడ్లపై ఆందోళన చేయాల్సి వచ్చిందని అన్నారు. పోలీసులు రోడ్డు ఎక్కడం చరిత్రలో ఇదే తొలిసారని చెప్పారు. హోంమంత్రి లేకపోవటం వల్ల కానిస్టేబుల్స్ యూనిఫాం వేసుకొని ధర్నాలు చేయాల్సిన దుస్థితి తెలంగాణలో దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్డర్లీ వ్యవస్థను తీసివేసినప్పటికీ పోలీసులతో ఇండ్లలో వివిధ పనులు చేపిస్తున్నట్టు వారి భార్యలు ఆరోపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.ఎన్నికల ముందు ఇచ్చిన ఏక్ పోలీస్ వ్యవస్థపై సీఎం రేవంత్ మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. 18 రోజులకు 4 రోజులు కుటుంబంతో గడిపే పాత పద్ధతిని కొనసాగించాలని అన్నారు. డీజీపీ స్థాయి అధికారులు జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాలని కోరారు. తద్వారా 13 బెటాలియన్లు 8-10 వేల మంది కానిస్టేబుళ్లకు న్యాయం జరుగుతుందని చెప్పారు.

పోలీసుల ఆందోళనలు ఇదే తొలిసారి: సునీతాలక్ష్మారెడ్డి

కేసీఆర్ సంపాదించి పెట్టిన రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్‌ను రేవంత్‌రెడ్డి దెబ్బతీయేద్దని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి సూచించారు. మూడు నెలలకు ఒకసారి బదిలీ చేస్తే పోలీసుల కుటుంబాలు ఏమైపోతాయని, పిల్లల చదువులు ఏం కావాలని నిలదీశారు. కానిస్టేబుళ్ల సమస్యలు పరిష్కరించి, వారి కుటుంబాల్లో భరోసా నింపాలని అన్నారు.

మనసు కలిచివేస్తున్నది: వాణీదేవి

పోలీస్ వ్యవస్థలో నెలకొన్న దీనస్థితిని చూస్తుంటే మనసు కలచి వేస్తున్నదని ఎమ్మెల్సీ వాణీదేవి అన్నారు. గతంలో ఎన్నడూ ఇలాంటి ఘటనలు చూడలేదని ఆవేదన వ్యక్తంచేశారు.కానిస్టేబుళ్ల భార్యలు, కుటుంబసభ్యులు ధర్నాలు చేసిన ఘటన ఎక్కడా ఉండబోదని చెప్పారు. కుటుంబసభ్యులతో వారు ఉండకపోవడంతో అనేక సమస్యలు వస్తున్నాయని అన్నారు. వారు ప్రశాంతంగా ఉంటేనే డ్యూటీ బాగా చేయగలుతారని చెప్పారు.

మంచిర్యాల ప్లై ఓవర్‌పై రాస్తారోకో చేస్తున్న బెటాలియన్ కానిస్టేబుళ్లు, వారి కుటుంబ సభ్యులు

వరంగల్ జిల్లా మామునూరు బెటాలియన్‌లో నిరసన చేపడుతున్న కానిస్టేబుళ్లు

ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆందోళన చేస్తున్న కానిస్టేబుళ్ల కుటుంబసభ్యులు

హనుమకొండ జిల్లా కాజీపేటలోని ఓ చర్చిలో ఓ ఉన్నతాధికారి కుటుంబంలో పెండ్లికి బ్యాండ్ వాయిస్తున్న మామునూరు బెటాలియన్ కానిస్టేబుళ్లు

మాజీ ఐపీఎస్ ఇంట్లో పెండ్లికి బ్యాండ్

- మామునూరు బెటాలియన్ కానిస్టేబుళ్ల తో పని
- నిరసన వేళ వెట్టి చాకిరీపై సర్వత్రా ఆగ్రహం
- నిబంధనల మేరకేనని సమర్థించుకున్న అధికారి

వరంగల్, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 'ఏక్ పోలీసు, ఏక్ స్టేట్ కావాలి' అని కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు నిరసన తెలుపుతున్న సమయంలోనే.. ఓ రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఇంట్లో పెండ్లికి బెటాలియన్ కానిస్టేబుళ్లతో బ్యాండ్ కొట్టించారు. మాజీ ఐపీఎస్ అధికారి కుటుంబంలోని ఓ పెండ్లి వరంగల్ నగరం కాజీపేటలోని ఓ చర్చిలో శనివారం జరిగింది. మామునూరు లోని నాలుగో బెటాలియన్ పరేడ్‌లో పాల్గొనే కానిస్టేబుళ్లకు ఈ పెండ్లిలో బ్యాండ్ పనులు అప్పగించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మామునూరు బెటాలియన్‌లోని కానిస్టేబుళ్లు.. అధికారి కుటుంబంలో పెండ్లికి బ్యాండు కొట్టారు. పెండ్లికి ముందు రోజు రిహార్సల్ చేసి మరీ పంపించారు. కుటుంబ సభ్యులు తమ కోసం నిరసనలు తెలుపుతుంటే తాము వెట్టి పనులు చేయాల్సి వస్తున్నదని వాపోయారు. బెటాలియన్ కానిస్టేబుళ్లకు బ్యాండ్ పనులపై ఫొటోలు తీసేందుకు వెళ్లిన 'నమస్తే తెలంగాణ' సిబ్బందిపై సదరు మాజీ ఐపీఎస్ అధికారి బెదిరింపులకు దిగారు. 'పోలీసు కుటుంబాల్లో ఫంక్షన్లకు బెటాలియన్లలోని బ్యాండ్ పార్టీని పిలవడం నిబంధనలో ఉన్నది. మూడు నెలల ముందే డబ్బులు కట్టి అనుమతి తెచ్చుకున్నాం. ఫొటోలు తీస్తే చర్యలు తీసుకుంటాం' అని హెచ్చరించారు.

ఏక్‌పోలీసుపై మాటతప్పిన సీఎం

- ఎన్నికల్లో ఏక్‌పోలీసు అమలు చేస్తామని హామీ
- రాష్ట్రవ్యాప్తంగా బెటాలియన్ పోలీసుల ఆందోళన
- 28న యూనిఫాంలోనే సచివాలయం ముట్టడి?
- ఆందోళనల్లో పాల్గొన్నవారి సస్పెన్షన్ ఆర్డర్స్ రెడీ?

హైదరాబాద్, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ): ఎన్నికలకు ముందు పీసీసీ అధ్యక్షుడి హోదాలో 'ఏక్ పోలీసు' వ్యవస్థను తీసుకొస్తామని హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి.. ముఖ్యమంత్రి అయ్యాక పట్టించుకోవడం లేదని టీజీఎస్పీ బెటాలియన్ పోలీసులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. శనివారం అన్ని బెటాలియన్ల నుంచి కానిస్టేబుళ్ల భార్యలు, కుటుంబ సభ్యులు న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని రోడ్లమీదకు వచ్చారు. కొందరు టీజీఎస్పీ కానిస్టేబుళ్లు ఏకంగా తమ బెటాలియన్లలోనే ఆందోళనలకు దిగారు. ఆయా బెటాలియన్ల కానిస్టేబుళ్లతో మట్టి, ఇసుక మోయించడం, చెట్లను కొట్టించడం, గడ్డి పీకించడం వంటి పనులు చేయిస్తున్నారని, తమ బతుకు 'హోంగార్డుకు ఎక్కువ.. కానిస్టేబుల్‌కు తక్కువ' అన్న చందంగా ఉందని ఉన్నతాధికారుల ముందు కన్నీటి పర్యంతమయ్యారు. 'టీజీఎస్పీ వద్దు.. ఏక్ పోలీస్ ముద్దు' అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. దీంతో 'రక్షణ ఇవ్వాల్సిన పోలీసులే రోడ్డెక్కారు.. పోలీసులకు భరోసా ఇచ్చే హోంమంత్రి లేడు. హామీ ఇవ్వాల్సిన ముఖ్యమంత్రి పక్క రాష్ట్రాలకు తిరుగుతున్నాడు' అని రాజకీయ విశ్లేషకులు విమర్శిస్తున్నారు. 'టీజీఎస్పీ కానిస్టేబుళ్లను పెండ్లి చేసుకోమన్నది ఎవరమ్మా?' అంటూ ఉన్నతాధికారులే తమ భార్యలకు కౌన్సెలింగ్ ఇవ్వడం దారుణమని కానిస్టేబుళ్లు వాపోతున్నారు.

28న యూనిఫాంలోనే ఆందోళనలు..

తమ డిమాండ్లను నెరవేర్చుకునేందుకు ఈనెల 28న యూనీఫాంలోనే సచివాలయం ముట్టడికి బెటాలియన్ కానిస్టేబుళ్లు, వారి కుటుంబసభ్యులు పిలుపునిచ్చారు. ఇప్పుడు తప్పితే.. ఇక ఎప్పటికీ ఏక్ పోలీసు వ్యవస్థను సాధించుకోలేమని భీష్మించుకొని కూర్చుకున్నారు. సోమవారం నాటి ఆందోళనలకు సమాయత్తం అవుతున్నారు. ఇప్పటికే డీజీపీ నుంచి స్పష్టమైన ఆదేశాలు రావడంతో ఆందోళనల్లో పాల్గొన్నవారిని సస్పెండ్ చేసేందుకు ఆయా బెటాలియన్ల కమాండెంట్లు ఆర్డర్స్‌ను సిద్ధం చేస్తున్నట్టుగా విశ్వనీయంగా తెలిసింది.

రోడ్డెక్కితే క్రమశిక్షణ చర్యలే

- యథావిధిగా విధుల్లో చేరండి, దర్బార్‌కు రండి
- బెటాలియన్ కానిస్టేబుళ్లకు డీజీపీ జితేందర్ హెచ్చరిక
- ఆందోళనలపై ఉక్కుపాదం

హైదరాబాద్, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ): తమకు న్యాయం చేయాలని బెటాలియన్ కానిస్టేబుళ్లు చేస్తున్న ఆందోళనలపై రాష్ట్ర పోలీసుశాఖ ఉక్కుపాదం మోపింది. నిబంధనలకు విరుద్ధంగా ఆందోళనలు చేస్తే.. క్రమశిక్షణ చర్యలు తప్పవని డీజీపీ జితేందర్ హెచ్చరించారు. ఈ మేరకు డీజీపీ కార్యాలయం శనివారం ఓ నోట్‌ను విడుదల చేసింది. తెలంగాణ రాష్ట్ర స్పెషల్ పోలీస్ (టీజీఎస్పీ) సిబ్బంది నిర్వహిస్తున్న విధులు కొన్ని దశాబ్దాల నుంచి అమలు జరుగుతున్నాయని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో టీజీఎస్పీ పోలీసు సిబ్బంది విధి విధానాలు అమలు జరిగినట్లుగానే తెలంగాణలోనూ కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. టీజీఎస్పీ సిబ్బంది సమస్యలను మెరిట్ ప్రాతిపదికన సానుభూతితో పోలీస్ శాఖ పరిశీలిస్తుందని, ఇతర ప్రభుత్వ విభాగాల ఉద్యోగులకు ఎవరికీ లేని విధంగా వారికి సరెండర్ లీవులు, అడిషనల్ సరెండర్ లీవులు మంజూరు చేశామని తెలిపారు. రాష్ట్రంలో పోలీస్ సిబ్బందికి చెల్లించే వేతనాలు, భత్యాలు ఇతర రాష్ట్రాలతో పోలిస్తే అధికంగా ఉన్నాయని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ సిబ్బంది కోసం సంక్షేమ కార్యక్రమాలను చేపడుతుందన్నారు. ఈ పరిస్థితుల్లో టీజీఎస్పీ సిబ్బంది ఆందోళనలు చేపట్టడం సమంజసం కాదని, యూనిఫామ్ ధరించే టీజీఎస్పీ సిబ్బంది అత్యంత క్రమశిక్షణతో విధులను నిర్వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. క్రమశిక్షణతో వృత్తి ధర్మాన్ని నిర్వహిస్తూ పోలీస్ శాఖ ప్రతిష్ఠను ద్విగుణీకృతం చేయాల్సిన సిబ్బంది.. పోలీస్ శాఖకు మచ్చ తెచ్చే విధంగా వ్యవహరించకూడదని కోరారు. టీజీపీఎస్పీ సిబ్బంది యథావిధిగా తమ సాధారణ విధులను నిర్వహించాలని, సమస్యలు ఏమైనా ఉంటే వారి కోసం నిర్వహిస్తున్న 'దర్బార్' కార్యక్రమం ద్వారా వారి అధికారులకు/కమాండెంట్లకు/అడిషనల్ డీజీపీకి తెలపాలని సూచించారు. లేకపోతే వారి ఆందోళన కార్యక్రమాలను తీవ్రమైన విషయంగా పరిగణించాల్సి వస్తుందని హెచ్చరించారు. పోలీస్ ఫోర్స్ యాక్ట్, పోలీసు యాక్ట్, పోలీసు మాన్యువల్ ప్రకారం చట్టపరమైన, పరిపాలనాపరమైన కఠిన చర్యలు ఉంటాయని స్పష్టంచేశారు.

కానిస్టేబుళ్లపై ఆర్టికల్ 311 ప్రయోగం?

- అనధికారిక ఆదేశాలిచ్చిన పోలీసుశాఖ
- ఉద్యోగాలు తీసేసేందుకు పోలీసుశాఖ యత్నం

హైదరాబాద్, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ): తెలంగాణ స్పెషల్ పోలీస్ (టీజీఎస్పీ) బెటాలియన్ కానిస్టేబుళ్ల ఆందోళనలపై పోలీసుశాఖ కఠిన నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. వారి సమస్యలను పరిష్కరించకపోగా ఆందోళనలు చేస్తున్నవారిపై ఆర్టికల్ 311ను ప్రయోగించేందుకు సిద్ధమైంది. ఆందోళనలో పాల్గొన్న బెటాలియన్ కానిస్టేబుళ్లను, వారిని ప్రేరేపించిన వారిని వెంటనే సర్వీస్ నుంచి డిస్మిస్ చేసేందుకు సిద్ధమైనట్టు సమాచారం. ఈ అంశంపై అధికారికంగా ఆదేశాలు బయటికి రాకపోయినప్పటికీ.. ఆందోళనల బాటపట్టిన వారిని తొలగించేందుకు అనధికారిక ఆదేశాలు ఆయా బెటాలియన్ల కమాండెంట్లకు శనివారం రాత్రి అందినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఆయా బెటాలియన్లలో ఎవరెవరు ఆందోళనలకు దిగారు? వారి కుటుంబసభ్యులు ఎవరు? ఉన్నతాధికారులను ధిక్కరించి మాట్లాడిన వారెవరు? తెలుసుకొనేందుకు బెటాలియన్ల కమాండెంట్లు వివరాలు సేకరిస్తున్నారు. ఆందోళనల్లో పాల్గొన్న వారి వీడియోలు, ఫొటోలు తీసి ఇప్పటికే ఉన్నతాధికారులకు పంపినట్టు తెలిసింది. అయితే, ఈ ఆందోళనల వెనుక ప్రభుత్వ వ్యతిరేక శక్తుల హస్తం ఉన్నట్టు ప్రభుత్వం భావిస్తున్నది. ఈ నేపథ్యంలోనే ఆందోళనల్లో పాల్గొన్నవారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకునేందుకు సిద్ధమైనట్టు సమాచారం. సెలవుల విధానంపై పాత పద్ధతినే అనుసరిస్తామని పోలీసుశాఖ చెప్పినా కూడా.. తమ మాట వినకుండా మొత్తం టీజీఎస్పీ వ్యవస్థనే రద్దు చేసేలా పోలీసు కుటుంబాలు ఆందోళనలు చేయడంపై డీజీపీ జితేందర్ ఓ ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

పీఎస్‌లో కాంగ్రెస్ నాయకుడి గూండాగిరి

- పోలీసుల ఎదుటే బాధితుడిపై దాడి
- కేసు నమోదు చేసిన ఎస్సై

ములుగు, అక్టోబర్ 26 (నమస్తేతెలంగాణ): ఓ కాంగ్రెస్ నాయకుడు పోలీస్ స్టేషన్‌లోనే గూండాగిరికి దిగాడు. పోలీసుల ఎదుటే బాధితుడిపై దాడి చేశాడు. ఈ ఘటన ములుగులో శనివారం రాత్రి జరిగింది. ములుగుకు చెందిన సర్వే నంబర్ 1256లోని 7 ఎకరాల భూమిలో తనకు 11 గుంటల భూమి వస్తుందని కాంగ్రెస్ నాయకుడు పోరిక రాజూ నాయక్ భూ యజమాని మూర్తాల గురువారెడ్డితో శనివారం పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ ఏర్పాటు చేశారు. పంచాయితీ అనంతరం గురువారెడ్డి తరపు పెద్దమనుషులు ములుగు జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు జన్ను రవి, నద్దునూరి రమేశ్, ఇంచర్ల పీఏసీఎస్ చైర్మన్ చిక్కుల రాములు, ఓరుగంటి అనిల్, దామెర రాజులుగులోని ఓ టీ కొట్టు వద్ద కూర్చున్నారు. రాజూనాయక్ అనే వ్యక్తి ఫోన్‌లో జన్ను రవిని ఎక్కడున్నారనే సమాచారం కనుక్కొని తన కుమారుడు సునీల్‌నాయక్, మరో నలుగురు అనుచరులతో వచ్చి దుర్భాషలాడాడు. ఈ క్రమంలో సదరు వ్యక్తులు ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా డ్యూటీలో ఉన్న పోలీసుల ముందే జన్ను రవిపై రాజూనాయక్ చేయి చేసుకున్నాడు. ఎస్సై వెంకటేశ్వర్‌రావు పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని గొడవపై ఆరా తీశారు. రాజూనాయక్‌ను పీఎస్ నుంచి వెళ్లాల్సిందిగా చెప్పినప్పటికీ రాజునాయక్, అతడి కుమారుడు వెళ్లకుండా ఎస్సైతో వాగ్వాదానికి దిగారు. దీంతోపాటు ఫిర్యాదుదారులను నడిరోడ్డుపై నరికేస్తామని బెదిరింపులకు పాల్పడ్డారు. జన్ను రవి ఫిర్యాదు మేరకు దాడి చేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.